# మజిలీ

శ్రీ గుజ్జుంకొండ తిరుపతిరావు

మధ్యాహ్నం. మింటి సూర్యుడు మండు టెండలతో మాడ్చేస్తున్నాడు. వెచ్చని వడగాడ్పు శరీరాన్ని దహిస్తోంది. కడుపులో యెలుకలు హడావిడి చేస్తున్నయ్. కనీసం దాహం తీర్చుకుందామనుకున్నా కనుచూపుమేర యెక్కడా జలాశయం ఉన్నట్టు లేదు. చేసేదేమీ లేక ఉస్సురంటూ మా యస్. ఓ. యిచ్చిన స్కెచ్ ఆధారంగా ముందడుగేస్తున్నా.

''అంతకుముందే అనేక వందలమందిని వాకబు చేశా. కాని ప్రయోజనంలేదు. ప్రయోజనం లేదని వూరుకుంటే...... వూరుకుంటే ఉద్యోగం కాళీ. ఉద్యోగం కాళీ అయితే చేతిలోకి చిల్లపెంకులు గూడా రావు. ఇంట్లో దొంతులు దొర్లుతుంటాయి. 'పొట్ట కూడు పెట్టలేని వానికి పెళ్లా మెందు'' కంటుంది శ్రీమతి. బ్రదుకు భారమౌతుంది. ఆలూ పిల్లలూ బజారున పడతారు. సభ్య ప్రపంచంలో తలెత్తుక తిరగలేను. దీనికి ఆఖరు సాల్వేషన్ సూయిసైడ్. అబ్బ! ఈ విధంగా వూహించుకుంటూ పోతోంటే భవిష్యత్తు అంధకారబంధురంగా కనిపించింది. లేమి ఘోరంగా నా కళ్లముందు నర్తించింది.

''అంతా అయోమయం....ఏదీ ఈ లచ్చాగూడెం దారే కనిపించదేం? దారి కనిపించకపోయినా అసలు ఆంధ్రదేశంలో.....కాదు...కాదు....అఖిల భారతంలో యీ వూరు యెక్కడైనా కనిపిస్తుందా? మా ప్రాణం తీయడానికి రెవెన్యూ చిట్టాల్లో మాత్రమే ప్రత్యక్ష మౌతూంటాయిగామోసు యిలాంటి వూళ్లు. వద్దురా బాబూ వద్దు. పగవాడికైనా ఈ సర్వే ఉద్యోగం. అందులోను ఈ నల్లమల అడవుల్లో సర్వే చేయడం వద్దు. వద్దనుకుంటే యెలా? కట్టుకున్న దానికి కనీసం గంజినీళ్లయినా పోయాలా? కర్తవ్య భారం ముందు కడుగేయించింది. అధికార వర్గంవారు ప్రసాదించిన స్కెచ్ మరల ఒకసారి నిశితంగా పరిశీలించా. తూర్పు పడమరలుగా కంకర రోడ్డు...దాన్ని క్రాస్ చేస్తూ పాతేరు. రోడ్డుకు ఉత్తరంగా పదవ మైలురాయి వద్ద గుర్తించబడిన కాలిబాట. బాటకు ఈశాన్యంగా ''నల్లకొండల తిప్ప'' దాని అవతల భాగంలో 'లచ్చాగూడెం' నన్ను అపహాస్యం చేశాయి. పట్టుదలతో ముందుకు నడిచా.

హఠాత్తుగా ఘుర్ఘురవాలు వినిపిస్తున్నాయి. ''బహుశా అడివి పందులో....ఏదు పందులో అయి వుంటాయి. ఇంకేముంది? మనిషిని చూశాయా అంటే నా పని కాళీ. ఈ రోజుతో నూకలు చెల్లే యీ 'అడవి'లో అడుగు బెట్టాననుకున్నా! ఈ పం స్ఫురించగానే యికముందుకు ఒక్క అడుగు గూడా వేయలేకపోయాను! వెనుదిరిగి చూశా! ఇంకేముంది? గుండె జల్లుమంది. వెంట తీసుకొచ్చిన గైడ్ వెనుకనే మాయమయ్యాడు. అడవి కంప చెట్లు దట్టంగా దడులు కట్టినట్లుగా నిలబడి ఉండి దృష్టి కిరణాలను గజం దూరం కూడా ముందుకు పోనియ్యడంలేదు. అడవి పందుల రొద మరీ దగ్గరగా వినిపిస్తోంది. మందలు మందలుగా అవి యెక్కడికో దండు వెడలాయనిపిస్తోంది. శరీరం కంపించింది. వళ్లంతా చెమటలు పట్టింది. కళ్లు తిరిగాయి. కాళ్లు తడబడ్డాయి. ముందుకు పాదం వేయడంతో చిటికెన వ్రేలంత లావున ఉన్న కొండముల్లు అరచేతి మందాన వున్న పాదరక్షను చీల్చుకుంటూ పాదంలోకి ప్రవేశించింది. రక్తం ధారగా స్రవిస్తూ వుంది. చేసేదేమీలేక బాధతో అక్కడే కూలబడిపోయా.

ఇంతలో మాయమైన గైడ్ మళ్లీ తిరిగొచ్చాడు. వస్తూనే చెప్పుకపోతున్నాడు. ''తల్లి సిగదరగ సెడగొరికినయ్ బాబూ పాడీగలు. అయినా వదల్తాననుకుండయేమో! అంతమాత్తరానికే వదిలే ఘటం గాదుగా యిది. ఈగలనదిలిస్తూ 'సిరిమాను' తొర్రలో నున్న పట్టును వడేసి లాగినా. అమ్మకొడుకు సేతికి జిక్కింది గాని నోటాకుదాకా కారిపోయిందయ్యా!'' అంటూ తను సంపాదించిన తేనె పట్టును నా ముందు పెట్టాడు. మామూలు పరిస్థితుల్లోనయితే, ఆ తేనె పట్టును జూచి అమృతం దొరికినంతగా సంతోష పడేవాణ్ణే గాని, ఈ స్థితిలో అది నన్నేమీ సంతోష పెట్టకపోగా, అతని మాటలు మరీ చిరాకు తెప్పించాయి. దూరంగా పొమ్మని గర్జించా. నేను చేయలేని కార్యాన్ని తాను కనుగొని సాధించాననే సంతృప్తితో మిలమిలా మెరిసిపోతున్న ఆ కండ్లలోని కాంతి తటాలున మాయమైంది. అతను బెదురుతూనే ముందుకు వచ్చి నా స్థితిని గ్రహించాడు. ముందుకువంగి నా కాలులోని ముల్లును బలంకొద్దీ లాగివేశాడు. అంతకుముందు స్రవించి గడ్డ కట్టుకపోయిన రక్తం మరల ధారగా కారుతూంది. బాట మీది మట్టిని చేతితో తీసుకొని తార్చి నా గాయం మీద పోశాడు. అంతటితో రక్తం కారడం ఆగిపోయింది. ఆ విధంగా అతను నా గాయానికి ప్రకృతి వైద్యం చేశాడు.

''అడవిలో యింత అజాగర్తగా ఉంటే యెట్ల బాబూ? కూసింత సేపు యీ చెట్టు నీడలో పడుకోండి'' అంటూ ఆ చెట్టు క్రింద కంపా, గోకికుండా శుభ్రం చేశాడు. పైమీది పంచతీసి పరిచాడు. దానిమీద వత్తిగిలుతూనే 'సర్వే సరంజామా' అతనివద్ద లేదని గ్రహించా. చెడామడా చీవాట్లేశా. దానికి అతను చిన్నబుచ్చుకుంటూ ''అయ్యో! తేనె సంబరంలో సెట్టుకాడ మరిసొచ్చినా. యిక్కడికెంతో దూరంలేదు. బేగి తిరిగొస్తా బాబయ్యా!'' అంటూ వచ్చినదారేబట్టి మళ్లీ వెళ్లాడు.

క్రమంగా పందుల రొద దూరంగా పోతూ వుంది. అతను వెళ్తూంటే నా దృష్టి అతనిపై బడింది. ముగ్గుబుట్టలాంటి తల! ముడుతలుపడిన శరీరమూ, పట్టు సడలిన అవయవాలూ, పాపం! ఒక్కరూకకోసం ప్రొద్దస్తమానం నన్నంటిపెట్టుకొని తిరిగే ఆ ముసలివగ్గుమీద జాలి కలిగింది. కొడుకులూ, మనవలూ సంపాదించి పెడుతూ వుంటే వారి పోషణలో కాలం గడపాల్సిన వయసులో అతని కెందుకూ యీ పాట్లు? పొట్ట కూటికోసం!'' అబ్బ! ఇందాక అతన్ని యీసడించి, చీవాట్లేసినందుకు నాలోనే నేను సిగ్గుపడ్డా. అతను వచ్చిన తరువాత క్షమాపణ కోరుకుందామనుకున్నా. కాని నాలోని మధ్య తరగతి అహంకారం నన్నావిధంగా చేయనీయదు.లే. మేధావిననే గర్వం అరవైరాళ్లు సంపాదించుకునే సర్వేయరును నన్నావహించింది. 'సభ్యత' అడ్డువచ్చి సమాజంలో అతి నికృష్టస్థానంలో ఉన్న కూలివానికి క్షమాపణ చెప్పుకుంటావా? అని నన్ను పహాస్యం చేసింది. వాటికి తలవంచాను. తలక్రింద చేతిని పూర్తిగా పెట్టుకొని సోలిపోయాను.

లేచి చూచేవరకు ''క్రాస్‌స్టాఫ్'' పూర్తిగా వేసుకుంటూ 'పెగ్స్', గొలుసుల కట్టను మోసుకుంటూ వస్తూన్న గైడ్ కనిపించాడు. ప్రొద్దు తిరుగుతూంది. ఇప్పుడేమి చేయాలి? తిరిగి వెనుకకు మరలి బస్సు అందుకుందామంటే రోడ్డు చేరడానికి కనీసం పది మైళ్లన్నా నడవాలి. అంతదూరం నడచినా బస్సు అందుతుందనేది సందేహాస్పదం. ఒకవేళ అందినా ఎప్పుడో ఒకప్పుడు ఈ లచ్చాగూడెం దాపుకు రావలసి ఉంటోంది. అందుకని ముందుకు వెళ్లడానికే నిశ్చయించుకున్నా. 'గైడ్' వచ్చిన తరువాత యింకా ఎంతదూరం వెళ్లాలో అడిగా. ''అబ్బే యెంతోదూరం లేదు బాబయ్యా. అదో ఆ కనపడేదే నల్లకొండల తిప్ప. మనం బాగా నడిస్తే పొద్దు మునిగేతలోగా చేరుకోవచ్చు'' చెప్పాడు 'గైడ్' ఈ ప్రాంతమంతా అతనికి కొట్టిన పిండి. ఈ ప్రాంతాలను గురించి యెన్నో కథలనూ గాథలనూ చెప్తూ, యెప్పుడూ హుషారుగా ఉండేవాడు. ఈలాంటి గైడ్‌ను సంపాదించు కున్నందుకు నన్ను నేనే యెంతో అభినందించుకున్నా. ఇద్దరమూ మా గైడ్ తెచ్చిన తేనె త్రాగి, అంతకుముందే సంచిలో తెచ్చుకున్న ఫలహారాన్ని కొద్దిగా తిని ముందుకు నడిచాము:

కనుమ బాటమీదుగా 'నల్లకొండల తిప్ప' దాటుతూ వుంటే బాట కిరువైపులా వెదురు చెట్ల అడవులు ప్రత్యక్షమయ్యాయి. ఒక దానొకటి రాచుకుంటూ, సద్దుచేస్తూ భీతిని గొల్పుతున్నాయి వెదురు చెట్లు.

అది విశాలమైన మైదానం. ఆ ప్రదేశాన్ని, కొండను పటంలో పోల్చుకున్నట్లయితే దీర్ఘ చతురస్రాకారంమీద శంఖును నిలిపినట్లుగా వుంది. ఆ మైదానంనిండా ముండ్ల కంచెలు గాకుండా రేల్ల దుబ్బులు దట్టంగా పెరిగి ఉన్నయ్. ఆ మైదానం మధ్య భాగంలో మఱ్ఱిచెట్టు యెన్నో మన్వంతరాలనుండి జీవిస్తున్నదా అనిపిస్తోంది. ఆ చెట్టును చూడగానే శ్రీకృష్ణ దేవరాయలవారి "అర్ధయోజన జటావాటోత్థ శాఖోప శాఖాంచ జాట.....ఫలస్ఫాయ ద్వటక్ష్మాత్రజము" తలపుకు వచ్చింది. బహుశా రాయలు ఈ చెట్టును చూచే ఆ విధంగా వర్ణించాడేమో? దాని క్రింద కొండ బండ. దాదాపు పందమంది ఆశీనులవడానికి సరిపోయేలా వుంది. ఆ బండకు అభిముఖంగా నల్ల కొండల తిప్పలో నిట్టనిలువునా నిల్చొని ఉన్న వేరొక రాయిపై ఆజానుబాహువైన ఒక మనిషి, అతని పాదాలు నాకుతూ ప్రక్కనే కూర్చొని ఒక పులి. రూపాలు చెక్కబడి ఉన్నయ్. ఆ ప్రదేశంనిండా అలముకొని ఉన్న రెల్లు దుబ్బుల మధ్య అక్కడక్కడా సగం నేలలో పూడిపోయిన, గుంటలుగా మలచబడిన రాళ్లు ఆ ప్రదేశంలో యెప్పుడో ఒకప్పుడు మానవులు కాపురం చేశారనడానికి చిహ్నాలా? అన్నట్లు పడి ఉన్నయ్. ఆ రెల్లు దుబ్బుల మధ్యలో చెవుల పిల్లులు నిర్భయంగా గంతులేస్తూ ఆడుకొంటున్నయ్.


ఏ నర మానవుడూ సంచరించని ప్రదేశాన్ని సర్వే చేయించడానికి పంపిన మా డిపార్టుమెంటును మనసులో తిట్టుకుంటూ, దాహం తీర్చుకొనడానికి చారెడు నీళ్లయినా దొరుకుతాయేమోనని ఆ ప్రాంతాలన్నీ కలయజూచాను. అల్లంత దూరాన ఓ చిన్న జలాశయం కనిపించింది. సర్వే సరంజామాను ఆ బండమీద పడేసి దానిదరికి చేరా. ఆ చెరువు యెఱ్ఱ తామరలూ, నల్ల కలువలతో నిండుగా నిండివుంది. (నా జీవితములో మొట్టమొదటిసారిగా నల్ల కలువలను ఆ ప్రాంతంలోనే చూచాను) ఏమిటిది? ఈ నిర్జన ప్రదేశంలో వీటి అందాన్నెవరు తిలకిస్తారని! బహుశా జనపదాల్లో ఉంటే వాటిని చూడ్డానికి అలవాటుపడి ఆనందా న్నాస్వాదించ లేరేమో!

పడమటి సంద్రంలో మునిగిపోతూన్న భాను గోళపు సింధూరకాంతులా తటాకంలో ప్రతిఫలిస్తూ మరింత ఆనందాన్ని కలుగజేస్తున్నాయి.

నలుదిక్కులా నల్లమల మహారణ్యం, మధ్య భాగంలో మైదానం, మైదానంలో తటాకం, తటాకంలో ప్రతిఫలిస్తున్న భానుమూర్తి బంగరు కిరణజాలం, కలువకన్నెలు, పద్మినిలు. ఆ ప్రకృతి సౌందర్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. బాహ్య ప్రపంచాన్ని, నా ప్రయాణ బడలికను మరచిపోయి ప్రకృతిలో లీనమయ్యాను.

జలజబాంధవుడు పశ్చిమాంబుధిలో మునిగి పోతున్నాడు. తన ప్రియుని తననుండి వేరు చేస్తున్న కాల పురుషుని దూషిస్తూ ముఖ పద్మాలను ముకుళించలేక, అతనివేపే దీనాతిదీనంగా జూస్తూ 'మరల నీ దర్శనభాగ్యం లభించేదెప్పుడు ప్రభూ?' అంటూ తనను వదలలేక వదలిపోతూన్న ప్రియునికి బాధాతప్త హృదయంతో కెందామరలు వీడ్కోలు చెపుతూవుంటే, వాటిని అపహాస్యం చేస్తూ వారి ప్రియుడు కాలగర్భంలో కలసిపోతున్నందుకు ఆనందిస్తూ తమ రాజు తమను చేరవస్తాడనే సంతోషంతో నీలోత్పలాలు సింగారించుకొంటున్నయ్. ఒకే సరస్సు ఆలంబంగా పుట్టి పెరిగిన జలజ రహితాశ్రిత మొక్కలలోనే యింత వైరుధ్యమున్నప్పుడు ప్రపంచంలోని వివిధ దేశాల్లోని, వివిధ జాతుల మధ్య, వ్యక్తుల మధ్య వైరుధ్యాలూ, వైమనస్యాలూ ఉండటం సహజ మనుకున్నా.

మఱ్ఱిచెట్టు దరికి చేరాను. అనేక జాతుల పక్షుల కలకలారావాలతో కళకళ లాడుతుందా మహీరుహం. పాపం బాగా అలసిపోయాడేమో! ఆ మహావృక్షం వూడల్లో ఒకదానిని ఆనుకొని నిద్రపోయాడు


అహమద్ అండ్ కో.,

(హమ్‌దర్ద్ దవాఖానా (WAKF) ఢిల్లీ, డిస్ట్రిబ్యూటర్స్)

ఫోన్ నెం: 5736.

ట్రూప్ బజార్, మొజంజాహీ మార్కెట్ వద్ద, హైదరాబాద్.

శాఖలు: 1. పత్థర్‌గట్టి, 2. అబిడ్ సర్కిల్ వద్ద, 3. దబీర్‌పుర.
4. వరంగల్, 5. విజయవాడ.

తా గైడ్ ముసలితాత. "తాతా!" అని పిలుస్తూనే ఉలికిపడి లేచాడు. మా సరంజామా అంతా తీసుకొని జలాశయం దరికి చేరాము. ఫలహారం ముగించి ప్రక్కలు పరచాము. అప్పుడే కడలి గర్భంలోనుండి శీతమయూఖుని పూర్ణబింబం మెల్లిగా తొంగి చూస్తోంది. కలువ హృదయం విప్పారి ఆనందంతో గంతులేస్తోంది. ఆ ఆనందంలో నేను గూడ పాలు పంచుకుంటూనే, ఆ పరిసరాలను గురించిన భోగట్టా సేకరించాలనే తలంపుతో "తాతా! యిదివరలో యిక్కడెవరైనా మనుషు లుండేవారా?" అని అడిగా. ఇదివరకు మానవులు నివసించినట్లుగా అనేక చిహ్నె లగుపిస్తున్నా, రెవెన్యూ చట్టాల్లో ఆ గ్రామం పేరు నమోదై ఉన్నా, యిలాంటి ప్రశ్న వేసినందుకు నాలో నేనే నవ్వుకున్నా.

"ఉండేటోరు" అంటూ తాత చెప్పుకపోతున్నాడు. ఒక్క ఆడదానికోసం...ఒకటంటే ఒక్కటే మాపి. దానికోసం ఎంతమంది పోట్లాడుకున్నారు! ఎంతమంది కొట్లాడుకున్నారు! ఎన్ని పానాలు పోయినాయి! యెంతరగతం పారింది! లెక్కేనేదు! బాబయ్యా!

"అదేంటో వివరంగా జెప్పుతావా? తాతా" అని అడిగా.

"ఇనండయ్యా! ఆ యిశేసమంతా సెపతా" నంటూ మొదలెట్టాడు.

"యెనక తాతలకాలాన లంబాడోళ్ల తండాలు ఆవుల మేపుకుంటూ దేశం అంతా కోనకోనలా తిరుగుతా ఉండేయి. అట్టా తిరుగుతా తిరుగుతా వుండే వాటిల్లో ఒక తండా యీ అడివి కొచ్చింది. అప్పుడీ యడివంతా యెదురుతోపుల మయంగా వుండేది. యెదురు బియ్యం మస్తుగా దొరుకుతుండేయి. వాళ్ల గొడ్డూ గోదకు, గడ్డి గాదము గూడ మస్తుగా వుంది. అందుకని వాళ్లీ స్థలంలోనే కొంతకాలం ఉండిపోయినారు.

వాళ్లకు నాయకు డుండేవోడు. పేరుకు దగ్గ ఇంటు. లచ్చూ నాయకుడు. అమ్మ కొడుకు. ...మీసాలమీద నిమ్మకాయలు నిలిపెటోడు....ఎంత మాలావు పులిమీదైనా ఒంటిచేత్తో కలబడేవోడు. అదో ఆ బండ. ఆ పులి, ఆ మాసివుంది. దాన్ని ఆయనే మలిపించిండు. వోనికి యిద్దరు పెళ్లాలు. ఒకదాన్ని పెండ్లికూతుర్నిజేసి యింట్లో కూకోబెట్టి వుంటే, యింకో తండాలోనుంచి యెత్తుకొచ్చిండు. యింకొకదాన్ని వాళ్ల తండాలోనే బొట్టుగట్టిండు.

వాళ్ల తండా యీ స్థలంలోకి వచ్చిన తరువాత నాయకుడి చిన్న భార్యకు కూతురు కలిగింది. ఆ రోజు తండాలోని వాళ్లందరూ పండుగ జేసుకొని, కులదేవతకు జాతరచేసి ఆ పిల్లకు సుగాలమ్మ అని పేరు పెట్టిండ్రు. ఇప్పుడు నాయకుడి మనసంతా ఆ పిల్లపైనే. క్రింద దింపితే యెక్కడ మట్టైపోద్దోనని యెప్పుడూ చేతుల్లోనే ఉంచుకునేటోడు. ఆ పిల్లతో ఆడుకుంటూ, పాడుకుంటూ తానొక బుల్లిపిల్లోడై తక్కినోళ్ల సంగతే మరిసిండు.

ఆ సంటిబిడ్డ పెనంచికంలో పడిపోయి తన 'పెద్దాలి' అంటే యెవరని? యింకో తండాలోనుండి లేపుకొచ్చినే. ఆమె సంగతి అసలు పట్టించుకోవడంలా తరువాత యెన్ని రోజులకూ ఆమెకు పిల్లలు కలగక పొయ్యేతలికి 'గొడ్డుబోతని' సరిగ్గా చూడటం మానిండు. అసలే యెత్తుకొచ్చిందాయె. దానికితోటు యిప్పుడు సరిగ్గా చూడకపోవడం. కచ్చతో కుత కుతా ఉడికిపోయింది. అదునుకోసం కాసుక్కూర్చుంది దెబ్బతియ్యడానికి. అయినా పైకిమాత్రం బాగా ఉన్నట్లే నటన జేత్తుండాది.

యేండ్లు జరిగిపోయి...ఆ యేలెడు పిల్ల యెదిగి పెద్దదయింది.నాసామిరంగా!ఆ పిల్ల యెట్టుండదని? సుక్కల్లో సెందురెడ్లా గూడెంలో దగదగలాడి పోతుందంట ఆ పిల్లకు పరస్సైనోడల్లా నేను జేసుకోవాలంటే నేను జేసుకోవాలని వాళ్లల్లో వాళ్లే గుద్దులాడుకుంటుండారంట...ఇది యిట్లా ఉండగా మొదట లచ్చూ నాయకుడు పిల్ల నెత్తుకొచ్చిన తండా అవమానంతో తలెత్తలేక, యెప్పటికైనా పగ సాధించాలన్నసాధించాల్నని, యీళ్లని యెదుకుత వొచ్చి తిప్పకపతల దిగినారంట.

ఒకనాడు ఆవులమందను కాయడానికి లచ్చూ నాయకుడు పెద్ద పెళ్లాన్నంపాడు. ఆ మందను మేపుకొని పొద్దుగూకేటేళకు యింటికి తిరిగొస్తా చూసుకొనేవరకు మందలో ఆవు తప్పిపోయింది. ఇంటికిపొతే నాయకుడు తనను బతకనియ్యడని ఎదురుపొదల్లో యెదుక్కుంటూ, అట్లా అవతలి దిక్కుకుపోయింది. గుడిశెలు కావడేతలికి యెవురో ఆరాతీద్దామని దగ్గెరకి పోంగానే...యింకేముంది. వాళ్ల అమ్మా, అయ్యా కావద్దారు. ఆపాట్న వోళ్లను కరుసుకోని బావురుమని యేడుత్తావుంటే తండా నాయకుడు జూసి దగ్గెరకొచ్చి నల్లగా దువ్వి, మళ్ళా వోళ్ల 'తండాలోకి జేర్చుకోని మొదటి మొగుడితో కూరుత్తా'నని మాటిచ్చిండు... 'లచ్చూగూడేన్ని నాశనం జెయ్యాలని, వోడు (లచ్చూ నాయకుడు) లేని అదునులో చెప్పి అంప'మని కోరిండు. 'సందు సూసుకొని సెప్పంపుతా'నని మెల్లగా తిరిగి గూడేనికి సేరుకొంది.ఈసంగతెవరకీతెలవకుండాజాగర్తపడింది.

ఇది యిట్లా ఉండగా తన కూతుర్ని తనకంటే గొప్పోడికిచ్చి చెయ్యాలని లచ్చూ నాయకుడు అందర్నీ పిలిపి సభజేసి, వాళ్ల తండాలో తనకు నచ్చినోడెవరూ లేడని, అల్లుణ్ణి యెదకడానికి పయానమైపోయె. ఈ అదునులో తవోళ్లకు వార్త జేరేసింది అతని పెద్ద పెళ్లాం. ఒక అద్దరేత్తిరికాడ అవతలి తండాలో వోళ్లంతా బయలుదేరి యివతలకొచ్చి నాయకుడి గుడిసెలోకి దూరి కూతుర్ని యెత్తుకొని పోతుంటే తల్లి లెగిసి గోలజేసింది. ఆ గోలయిని అంతా మేలుకొని నాయకుడి యింటిదరి కొచ్చిండ్రు. కాని యేంజేత్తారు పాపం...! నిద్దరకండ్లతో తూలుత్తా వున్నోళ్లను, అడ్డమొచ్చినోళ్లను నరికి ఆ పిల్లను యెత్తుకపోయిండ్రు. వాళ్లతో గూడ లచ్చూ నాయకుడి పెద్ద భార్య పారిపోతుంటే మిగిలినోళ్లు పట్టుకొని దీని మూలాన్నే వచ్చటి తండా పాడయిందని దాన్ని రెండు తుండేలుగా నరికిండ్రు.

అది తెలిసి సుగాలిని గూడ అట్టానే సంపాలనుకున్నారంట తండాలోని ముసిలోళ్లు. పిల్ల సక్కదనం జూసి తండాలోని వయసుకాడొకడు మోజుపడి ఆ పిల్ల నెట్లయినా దక్కించుకోవాలని అనుకొన్నాడు. వాళ్ల కుల పెద్ద ఆ పిల్లను నరకటానికి కత్తియెత్తేలోగా వాడి మెడను తెగేసినాడంట. కుల పెద్ద దేవుడ్తో సమానమైనోడిని సంపిండని, వోణ్ణి వోళ్లు తూట్లు పడబడిసి సంపినారంట తండాలో వాళ్లందరూ. తరువాత అంతా యేకమై లచ్చూ నాయకుని కూతుర్ని అంటే సుగాలిని గుంటదీసి నడుంవరకు భూమిలో పాతిపెట్టి, ఆ పిల్లమీదుగా ఆవులమందను తోలారంట. ఆ మంద ఆ పిల్లను పలగదొక్కుతా ముందుకుపోయింది. ఆ తరువాత లచ్చూ నాయకుని తండాలో చావగా మిగిలినోళ్లు గొడ్డూ—గోదా తోలుకొని యీ పోటోదిలి యెటో యెల్లారంట. ఇప్పటికీ ఆ అమ్మాయి దయ్యమై రేత్రిళ్లు తిరుగుతుంటదని మా తాత సెప్పిండు" అంటూ తాత ఆస్థలాన్ని గూర్చిన గాథనువివరించాడు.

"అయితే తాతా! ఇంతకూ నీ వెరగవన్నమాట."

"అబ్బే నాకేటి తెలుసు బాబయ్యా! అప్పట్లో నేను పదేండ్ల బుడతణ్ణి. ఒకనాడు మా తాతెంట యీ ప్రాంతంలోకి కట్టెల కొచ్చినా....అప్పుడు జెప్పిండు. తన సిన్నతనంలో ఉండేవోరంట!"

"తాతా నిజంగా యిది జరిగి ఉంటుందంటావా? అని అడిగా అనుమానంగా.

"నిజం! పత్తెపెమాణికంగా. మా తాత పాణం పోయినా అబద్ధమాడేటోడు గాదయ్యా!" అన్నాడు తాత. పాపం! తన తాత నిజాయితీ మీద యెంత నమ్మకమో తాతకు!

"ఇది నిజంగా జరిగిందేనా? యింకా నన్ను అనుమానం వదలడంలా. ఏమో యెందుక్కాకూడదూ. పెద్దలు యౌవనోన్మాదంలో చేసిన పొరపాట్లకు పిల్లలకా ప్రాయశ్చిత్తం?! ఆ లచ్చూ నాయకుడి కూతురు 'సుగాలి' రూపం యెలా వుంటుందోనని వూహించుకొనడానికి ప్రయత్నించా. కాని నా వూహ కందలా. పాపం! పెద్దవారి క్రౌర్యానికి బలియైన అబల. నవయౌవన శోభావతి. తన తలపులోని వలపులు పూయించుకోవాలని యెన్నెన్ని కలలుగన్నదో. ఏ ప్రియుని కౌగిట్లో సొక్కి సొలిపోవాలని కాంక్షించిందో—తానూ ఒక మాతృమూర్తి అయి చంటిపాప చెక్కుటద్దాలను తనివిదీరా ముద్దిడుకోవాలని యెంతగా ఉవ్విళ్లూరిందో ఆ లేజవరాలికి యెంత అన్యాయం జరిగింది. ప్చ్....ప్చ్.

మరురోజు ఉదయం పనిపూర్తిచేసుకొని, సాయంత్రానికి వూరుచేరి, ఆఫీసుకెళ్లి సర్వే ఖండాల స్కెచ్ అప్పగించాను. నన్ను చూడగానే మా యస్. ఓ. "ఐ యామ్ వెరీసారీ మిస్టర్ రావ్! మీకు అనవసర శ్రమ కలిగించాను. ఆ లచ్చూగూడేన్ని రెవిన్యూ పద్దుల్లోనుండి తొలగించారని జి. ఓ. వచ్చింది" అని చెప్పారు. కాని నా శ్రమ వృథా అయిందని బాధపడలా....ఆ సుగాలీ ప్రతిరూపును వూహించుకొనలేకపోయాననే బాధ మాత్రమే మిగిలింది. అప్పుడేకాదు యిప్పుడు కూడా ప్రయత్నిస్తున్నా. ప్రతిసారీ ఓటమినే పొందుతున్నా. నల్లకొండల తిప్ప మైదానం, మద్దిచెట్లు, జలాశయం, వాటి మధ్య నడయాడిన సుగాలి యెలా వుంటుంది? ఏమో! ఆ పరిసరాలు గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆ అవ్యక్తమైన 'సుగాలి' నన్ను ఆలోచింపజేస్తూనే వుంది.